క్లుప్తంగా

పువ్వుల తోటల పరిశీలన



చామంతి తోటలను పరిశీలిస్తున్న హెచ్‌ఓ సుధీర్‌కుమార్, చిత్రంలో ఈలి గోపాలం

కడియం: వర్షాల కారణంగా చామంతి తోటల్లో నీరు నిలిచిపోయి ఎండుతెగులు సోకకుండా తగు జాగ్రత్తలు వహించాలని మండల ఉద్యానశాఖాధికారి డి.సుధీర్‌కుమార్ కోరారు. శనివారం ఆయన పొట్టిలంకలో పలు పువ్వుల తోటలను పరిశీలించారు. ఫ్యూజేరియం విల్ట్‌గా పిలిచే ఈ తెగులు నివారణకు కార్బండిజమ్ రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి స్ప్రే చేసుకోవాలన్నారు. అలాగే సూక్ష్మపోషకాలు అందించాలన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, నాయకుడు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలని నిరసన

కంబాలచెరువు: రెండేళ్లుగా పాఠశాల నిర్వహణ నిధులు సక్రమంగా విడుదల చేయలేదంటూ స్థానిక ఎస్‌కేవీటీ హైస్కూల్ వద్ద ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ నిధులు విడుదల కాక పాఠశాలల నిర్వహణకు హెచ్‌ఎంలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు కోలా సత్యనారాయణ అన్నారు. జిల్లా అధ్యక్షుడు కొండపల్లి వెంకటరమణారావు, ఆర్థిక కార్యదర్శి జీవీ గణపతిరావు, కార్యదర్శులు ఎస్ఎల్‌వీ రమేష్, టి.చక్రధర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చందన నాగేశ్వర్ పరామర్శ

కడియం: పితృవియోగంతో బాధపడుతున్న పార్టీ నాయకుడు గుత్తుల వాసును వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ శనివారం పరామర్శించారు. వాసు తండ్రి వెంకట్రావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. చందన వెంట పార్టీ నాయకులు గిరజాల వీర్రాజు (బాబు), లావేటి రమేష్, గుత్తుల రమేష్, కొప్పిశెట్టి సురేష్ ఉన్నారు.

సోనియాగాంధీ సేవలు అభినందనీయం

రాజమహేంద్రవరం సిటీ: ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు, యూపీఏ మాజీ చైర్ పర్సన్ సోనియాగాంధీ అందించిన సేవలు అభినందనీయమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణ కుమారి అన్నారు. సోనియాగాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానికజిల్లా పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ప్రచార కమిటీ చైర్మన్ డాక్టర్ వడయార్, హ్యూమన్ రైట్స్ జిల్లా నాయకులు పట్నాల శ్రీనివాస్, నలబాటి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కృష్ణానగర్‌లోని పార్టీ నగర కార్యాలయంలో నగర అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు బాలేపల్లి మురళీధర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. పీసీసీ కార్యదర్శి బెజవాడ రంగారావు, పీసీసీ సభ్యుడు చింతాడ వెంకటేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు కొవ్వూరి శ్రీనివాసరావు, దేవత సుధాకర్ పాల్గొన్నారు.

హోండా సీబీ 350 సీసీ బైక్ విడుదల



మోటారు సైకిల్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసిన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ: సప్తాానిక బిగ్ వింగ్ షోరూమ్ హోండా సీబీ 350 సీసీ బైక్‌ను శనివారం మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, సన్ రైజర్స్ రైడింగ్ క్లబ్ మెంబర్ విక్రమ్ సందీప్ చౌదరి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా హోండా బిగ్ వింగ్ షోరూమ్ అధినేత యిమ్మణ్ణి వెంకట్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం షెల్టన్ జంక్షన్ వద్ద ఈ షోరూంలో ప్రారంభోత్సవం సందర్భంగా మూడు మోటారు సైకిళ్ల అమ్మకాలు జరిపినట్లు తెలిపారు. వీటిని వెంకటకృష్ణ చైతన్య, చంద్రశేఖర్, శివ బాలాజీ కొనుగోలు చేశారన్నారు. సీబీ 350 సీసీ షోరూమ్ ధర డీలక్స్ రూ.2,14,800, డీలక్స్ ప్రో రూ.2,17,800గా నిర్ణయించామన్నారు. ఇవి ఐదు రంగుల్లో అందుబాటులో ఉంటాయన్నారు. పీజీఎంఎఫ్ఐ ఇంజిన్, హోండా సెలక్టబుల్ టార్క్ కంట్రోల్, హోండా సెలక్టబుల్ వాయిస్ కంట్రోల్ సిస్టమ్ తదితర ఫీచర్లు ఉంటాయన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ధవళేశ్వరం: స్థానిక ఇందిరా కాలనీకి చెందిన పారోజు రవి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బీరువాల పనిచేస్తూ జీవనం సాగించే రవికి అప్పులు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం భార్యతో గొడవపడి ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉన్నాడు. భార్య మణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేశవరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వంచిత నుదుటన వెలుగు రేఖ

- బాల వితంతువుకు కల్యాణ తిలకం దిద్దిన రోజు
- 1881 డిసెంబర్ 11న తొలి వివాహం జరిపించిన కందుకూరి

సీటీఆర్ఐ: వివాహమంటే బొమ్మలాట అనుకునే ప్రాయంలో ముక్కుపచ్చలారని బాలికలను కాసుల మీద ఆశతో చావడానికి సిద్ధంగా ఉన్న ముదుసలికి ఇచ్చి వివాహం చేయడం సంప్రదాయంగా చెలామణీ అవుతున్న రోజులవి. తెలిసీ తెలియని ప్రాయంలో వితంతువుగా మారిన చిన్నారుల మనోవ్యథలను కన్న తల్లితండ్రులే పట్టించుకోని రోజుల్లో యుగపురుషుడు కందుకూరి వీరేశలింగం వితంతు వివాహాలకు సమాజాన్ని సిద్ధం చేస్తున్నారు. వాటికి ఎదురైన ప్రతిఘటనలకు అంతే లేదు. అన్నింటినీ ఎదిరించి, తాను నమ్మిన సంస్కరణోద్యమాన్ని విజయపథాన చేర్చగలిగారు కందుకూరి వీరేశలింగం.

తొలి వితంతు వివాహం

కృష్ణా మండలం తిరువూరు డిప్యూటీ తహసీల్దార్ దర్భా బ్రహ్మానందం నుంచి కందుకూరికి ఒక లేఖ వచ్చింది. తిరువూరు ప్రాంతం రేపూడి గ్రామంలో గౌరమ్మ అనే 12 ఏళ్ల బాల వితంతువు ఉన్నదని, ఆమెకు మారు మనువు చేయదానికి ఆమె తల్లి



కందుకూరి వీరేశలింగం దంపతుల చిత్రపటం

సుముఖంగా ఉందని ఆ లేఖ సారాంశం. విశాఖపట్నంలో పోలీస్ శాఖలో ఉద్యోగం చేస్తున్న గోగుల పాటి శ్రీరాములు భార్యను కోల్పోయారు. ఆయనకు కందుకూరిపై గౌరవం, భక్తి ఉన్నాయి. వితంతువును వివాహమాడటానికి ఆయన అంగీకరించారు. ఈ వార్త నగరమంతా పొక్కి పెద్ద దుమారం లేచింది. కందుకూరి ఇంటికి వంట మనిషి రావడం



కందుకూరి జన్మగృహంలో ఏర్పాటు చేసిన తొలి వితంతు వివాహ బొమ్మల కొలువు

మానేసింది. ఇంటి పురోహితుడూ అంతే. ఇక బంధువులు వీరేశలింగాన్ని ఆడిపోసుకున్నారు. ఇంకేముంది అంతా నాశనమే అంటూ శాపనార్థాలు పెట్టారు. తీవ్ర ఉద్రిక్త వాతావరణంలో కందుకూరి ఇంట డిసెంబర్ 11వ తేదీ రాత్రి చారిత్రాత్మకమైన తొలి వితంతు వివాహం జరిపించారు. నాడు పోలీసులు, విద్యార్థులు కందుకూరికి బాసటగా నిలిచారు. ఆ తర్వాత ఆయన 39 వితంతు వివాహాలు జరిపించారు. వంకాయలవారి వీధిలోని కందుకూరి జన్మగృహంలో డిసెంబర్ 11వ తేదీ రాత్రి జరిగిన పునర్వివాహాన్ని స్మరిస్తూ విగ్రహాలను నెలకొల్పారు.

కందుకూరి స్ఫూర్తితో..



స్త్రీల సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదు. వారిపై అత్యాచారాలు, హత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. విద్యార్థులు, మేధావులు ఈ సమస్య పరిష్కారానికి కందుకూరి స్ఫూర్తితో కృషి చేయాలి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం మన లక్ష్యం కావాలి.

– డాక్టర్ పీవీబీ సంజీవరావు, కందుకూరి నాటక సాహిత్య పరిశోధకుడు, వీటీ కళాశాల తెలుగుశాఖాధిపతి

గొప్ప సంఘ సంస్కర్త



వందేళ్ల పైబడిన తర్వాత కూడా ఆయన ఆదర్శాలు, ఆచరణ అత్యంత సమకాలీన అవసరాలుగా కనిపిస్తున్నాయి. దీనిని బట్టి కందుకూరి వీరేశలింగం పంతులు ఎంత దార్శనికులో అర్థమవుతోంది. గొప్ప సంఘసంస్కర్త కాబట్టే స్త్రీజన ఉద్ధరణకు ఎంతో పాటుపడ్డారు.

– డాక్టర్ చప్పిడి కృష్ణ, ఉన్నత విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న గిరజాల వీర్రాజు

కడియం: దివ్యాంగులను అన్నివిధాలా ప్రోత్సహించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పెద్దాపురం నియోజకవర్గం పరిశీలకులు గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. స్థానిక నెం.1 ప్రాథమిక పాఠశాలలో శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గిరజాల బాబు మాట్లాడుతూ దివ్యాంగుల్లో ప్రతిభకు ఏమాత్రం లోటు ఉండదన్నారు. దీనిని గుర్తించి వారిని ప్రోత్సహించాలన్నారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు లజపతిరాయ్, నాగేశ్వరరావు, స్థానిక నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, పున్నమిరాజు వీర్రాజు, దొరబాబు, నందం విజయ్, హెచ్ఎం లక్ష్మణ్ పాల్గొన్నారు.

జాబ్ డ్రైవ్‌లో 55 మంది ప్రతిభ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వ అటానమస్ కళాశాలలో శనివారం జరిగిన జాబ్ డ్రైవ్‌లో 55 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు తెలిపారు. కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెమినార్ హాలులో వైజాగ్‌కు చెందిన నిర్మాణ్ ఆర్గ్ సంస్థతో కలసి నిర్వహించిన జాబ్ డ్రైవ్‌లో 125 మంది పాల్గొన్నారన్నారు. ఇందులో నవత ట్రాన్స్‌పోర్ట్స్, ముత్తూట్ ఫైనాన్స్, పేటీయం, అరబిందో ఫార్మా, డైకిన్ ఏసీ, హెటిరో లాబ్స్, హీరో మోటార్ కార్స్, టాటా కాపిటల్ ఫైనాన్స్, శ్రీరామ్ చిట్స్ అండ్ ఇన్సూరెన్స్ తదితర సంస్థలు పాల్గొన్నాయన్నారు. ప్రారంభ వేతనం రూ.12 వేల నుంచి రూ.ఇరవై వేల వరకు ఇస్తారని, పని స్థానాలు రాజమహేంద్రవరం, వైజాగ్, హైదరాబాద్, సూళ్లూరుపేట శ్రీసిటీలో ఉంటుందన్నారు. మౌఖిక పరీక్షలో ప్రతిభ చూపిన 55 మందికి కళాశాల ప్రిన్సిపాల్, వివిధ కంపెనీల హెచ్ఆర్‌లు నియామక పత్రాలు అందించారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ సమన్వయకర్త డాక్టర్ బి.హరనాథ్ రెడ్డి, లెఫ్టినెంట్ ఈసుబ్ బాషా, రాము యర్రా తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రతినిధులు

లోక కల్యాణార్థం సుబ్రహ్మణ్యేశ్వర మహాయజ్ఞం



మాట్లాడుతున్న ముసునూరి అయ్యప్ప

సీటీఆర్ఐ: ఆధ్యాత్మిక సేవా సమితి ఆధ్వర్యాన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాల్లో భాగంగా సహస్ర చండీ సహిత సుబ్రహ్మణ్యేశ్వర రుద్రపంచాయతన మహాయజ్ఞం శనివారం స్థానిక పార్వతీ పద్మావతీ కల్యాణ మండపం (శ్రీచందా సత్రం)లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా యాగ నిర్వాహకుడు ముసునూరి అయ్యప్ప మాట్లాడుతూ అందరి ఆరోగ్యం, లోక కళ్యాణార్థం ఈ నెల 18వ తేదీ వరకూ పది రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వేదుల వెంకటరమణమూర్తి శర్మ బ్రహ్మత్వంలో కడియాల వెంకటకృష్ణ సోమయాజి ఆధ్వర్యాన 40 మంది వేద పండితులు మహాయజ్ఞం సామూహికంగా చేస్తున్నారు. కడియాల వెంకటకృష్ణ సోమయాజి, ముసునూరి అయ్యప్ప మాట్లాడుతూ ప్రతి రోజూ అభిషేకాలు, జపాలు, హోమాలు, కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. 18వ తేదీన సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఉదయం అభిషేకాలు, సాయంత్రం విశేష సామూహిక శాంతి కల్యాణం చేస్తారు. కార్యక్రమంలో జేసీ తేజ్ భరత్, అడిషనల్ ఎస్పీ రజనీ, దంటు సూర్యప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో బలోపేతానికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న అడపా శ్రీహరి

రాజమహేంద్రవరం సిటీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నగరంలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అన్నారు. శనివారం ఒకటవ డివిజన్ పార్టీ ఇన్‌చార్జి ముప్పన ప్రభాకర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, ఇంకా ఎవరికైనా అందాల్సి ఉందా అనే విషయాలను క్షుణ్ణంగా చర్చించారు. ప్రతి కార్యకర్తా సైనికుడిగా పనిచేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేసేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర ఎస్టీ సెల్ చైర్ పర్సన్ సాలా సావిత్రి, కార్యకర్తలు అనురాధ, తానేటి శరత్, కానూరి స్టాలిన్ పాల్గొన్నారు.

ఐక్యంగా ముందుకు సాగితే అభ్యున్నతి

- ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్
- ఘనంగా వన సమ్మేళనం

రాజమహేంద్రవరం రూరల్: ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలందరం ఐక్యంగా ముందుకు సాగుదామని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. నగరంలోని చెరుకూరి గార్డెన్స్‌లో శనివారం మన చైతన్యం – వన సమ్మేళనం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా అనేక హక్కులను దేశ ప్రజలకు అందించారన్నారు. ఆయన కల్పించిన ఓటు హక్కు ద్వారానే నేడు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు చెందిన అనేక మంది సర్పంచ్ నుంచి ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి పదవులను అందుకోగలిగారన్నారు. మనలో అనైక్యతను సృష్టించేందుకు కొన్ని దుష్టశక్తులు నిత్యం పనిచేస్తూనే ఉన్నాయని, వారి కుయుక్తులను, కుట్రలను తిప్పికొట్టే దిశగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు ఆలోచన చేయాలని సూచించారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ నిట్టా శ్రీకృష్ణ, అడిషనల్ ఎస్పీ పి.సోమశేఖర్, ఏపీస్టేట్ హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌస్ లజామ్, ఏపీ ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం జనరల్ మేనేజర్ కె.తిలక్ కుమార్ తదితరులు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు ఉద్యమించాలని, రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎల్ఐసీ సీనియర్ జనరల్ మేనేజర్ బి.ప్రసాదరావు, ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తదితరులు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఐక్యవేదిక చైర్మన్ డాక్టర్ గుబ్బల రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో ఐక్యవేదిక కన్వీనర్ అజ్జరపు వాసు సారథ్యంలో జరుగుతున్న కృషిని అభినందించారు. అనంతరం అజ్జరపు వాసును గజమాలతో సత్కరించారు.



మాట్లాడుతున్న సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్

హిందూ వనసమారాధన

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ రాజమహేంద్రవరం జిల్లా ఆధ్వర్యంలో బొమ్మూరులోని వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో శనివారం హిందూ వనసమారాధన జరిగింది. ఈ కార్యక్రమానికి సుమారు 3వేల మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఓలేటి సత్యనారాయణ మాట్లాడుతూ అయోధ్యలో నిర్మాణమైన భవ్యరామ మందిరం ప్రతి హిందువుకు స్ఫూర్తి కేంద్రమన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విభాగ్ సహ సంఘచాలక్ రిమ్మలపూడి సుబ్బరాజు, జిల్లా కార్యవాహ రాచకొండ ప్రసాద్, జిల్లా వనవాసి కళ్యాణ ఆశ్రమం కార్యకర్తలు ఇరగవరపు పద్మావతి , చిలుకూరి రాధాకృష్ణ పాల్గొన్నారు.



ఏపీఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

ఐక్యంగా ఉంటేనే హక్కుల సాధన

రాజమహేంద్రవరం సిటీ: ఉద్యోగులందరూ ఐక్యంగా ఉంటే హక్కులు సాధించుకోగలరని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. జిల్లా బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుగారితోటలో శనివారం నిర్వహించిన కార్తిక వనసమారాధనకు ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కోమలి, డాక్టర్ అనసూరి పద్మలత పాల్గొన్నారు.

క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు



గ్రాండ్ క్రిస్మస్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న క్రైస్తవులు

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు గ్రామంలో క్రైస్ట్‌గ్రేస్ చర్చిలో శనివారం తెల్లవారుజామున క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాజమండ్రి మేలుకో అనే అంశంతో నగరం, పరిసర ప్రాంతంలోని సుమారు 40 మంది కలిసి ఒక్కొక్క చర్చిలో ప్రార్థనలు చేస్తున్నారు. క్రైస్ట్‌గ్రేస్ చర్చి రెవరెండ్ టాటావిక్టర్, సుగుణ విక్టర్ ఆహ్వానం మేరకు జి.జాన్‌ప్రసాద్ తదితరులు ప్రార్థన చేశారు. అనంతరం ఈనెల 14న ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగే గ్రాండ్ క్రిస్మస్ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఆర్యవైశ్య పాలక వర్గ ప్రమాణ స్వీకారం

కడియం: మండల ఆర్యవైశ్య సంఘం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం శనివారం అట్టహాసంగా జరిగింది. కడియం – బుర్రిలంక రోడ్డులోని ఒక ప్రైవేటు లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘం పెద్దలు హాజరయ్యారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబీ నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, పార్టీ రాష్ట్రకార్యదర్శి గిరజాల బాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, కడియం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ తదితరులు హాజరై ప్రసంగించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా గ్రంధి నాగబాబు, ఉపాధ్యక్షుడుగా గ్రంధి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా కంచర్ల వీరబాబు, కోశాధికారిగా నంబూరి మూర్తి, మరో 18 మంది కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు వారణాశి శ్రీనివాస గుప్త తదితరులు పాల్గొన్నారు. కాగా ఆర్యవైశ్య సంఘం కార్తిక వనసమారాధన కూడా నిర్వహించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్, చిత్రంలో వైశ్య సంఘం ప్రముఖులు

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు



పోటీలను పరిశీలిస్తున్న ఆర్జేడీ సత్యనారాయణమూర్తి

రాజమహేంద్రవరం రూరల్: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సాంకేతిక విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జె.సత్యనారాయణమూర్తి అన్నారు. బొమ్మూరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంటర్ పాలిటెక్నిక్ రీజినల్ లెవెల్ స్పోర్ట్స్‌అండ్ గేమ్స్ మీట్‌లో రెండవరోజు శనివారం పోటీలను ఆయన పరిశీలించారు. ఉదయం నుంచి 20 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి బాలురు కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కబడ్డీలో ఆంధ్రా పాలిటెక్నిక్ విన్నర్‌గా, కాకినాడ ఆదిత్య పాలిటెక్నిక్ రన్నర్‌గా, వాలీబాల్‌లో కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ విన్నర్‌గా, బొమ్మూరు జీఎంఆర్ పాలిటెక్నిక్ రన్నర్‌గా, బాల్ బ్యాడ్మింటన్‌లో ముక్తేశ్వరం ఎస్‌బీఆర్ఎం పాలిటెక్నిక్ విన్నర్‌గా, కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ రన్నర్‌గా నిలిచాయి. కాగా.. ఆదివారం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో అథ్లెటిక్స్ లాంగ్‌జంప్, హైజంప్, రన్నింగ్ పోటీలు నిర్వహిస్తామని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నాగేశ్వరరావు తెలిపారు. మెకానికల్ ఇంజినీరింగ్ హెడ్ ఎ.జగన్మోహనరావు, సూపరింటెండ్ ఆర్.మహేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ వి.విఠల్, జిల్లా ఫిజికల్ డైరెక్టర్స్ అండ్ పీఈటీల అసోసియేషన్ నాయకులు పీవీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు దోసకాయలపల్లిలో వికసిత్ యాత్ర

మధురపూడి: కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో ఆదివారం వికసిత్ భారత సంకల్పయాత్ర జరగనుంది. ఈ కార్యక్రమం ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత శనివారం పరిశీలించారు. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పర్యటన ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. పారిశుధ్యం, తాగునీరు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. దీనికి ముందు ఎయిర్‌పోర్టులో నిర్వహించబోయే టెర్మినల్ భవనం శంకుస్థాపన కార్యక్రమం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ వెంట జేసీ తేజ్ భరత్, ట్రైనీ కలెక్టర్ యశ్వంత్ కుమార్ ఉన్నారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు, పంచాయతీ రాజ్ అధికారి జానా సత్యనారాయణ, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మాధవరావు, జిల్లా విద్యాశాఖాధికారి కె.అబ్రహం, సివిల్ సప్లయిస్ డీఎస్ఓ విజయ భాస్కర్, కోరుకొండ తహసీల్దార్ పాపారావు, ఎంపీడీఓ పీకే నరేష్‌కుమార్ పాల్గొన్నారు.



దోసకాయలపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

లారీని ఢీకొన్న మోటార్ బైక్

- ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు
- కవలగొయ్యి వద్ద ఘటన



అంబళ్ల చైతన్య (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: సడన్‌గా ఆగిన లారీని మోటార్ బైక్ ఢీకొన్న ఘటనలో విద్యార్థి మృతి చెందగా, మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. శనివారం మధ్యాహ్నం జాతీయ రహదారిపై కవలగొయ్యి వద్ద ఈ ఘటన జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాటిలైట్‌సిటీకి చెందిన అంబళ్ల ఫణిరాజు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ సెలవు రోజుల్లో గ్రానైట్ పనికి వెళుతుంటాడు. శనివారం ఉదయం మేస్త్రీ బైక్‌పై కోరుకొండలో గ్రానైట్ పనికి వెళ్లాడు. పనిపూర్తవ్వగానే మధ్యాహ్నం తన తమ్ముడు అంబళ్ల చైతన్య (16)కు ఫోన్‌చేసి బైకు తీసుకుని కోరుకొండకు రమ్మన్నాడు. దీంతో చైతన్య, అతడి స్నేహితుడు శీరం శ్రీరామ వెంకట కిషోర్‌తో కలిసి బైక్‌పై కోరుకొండ వెళ్లాడు. అక్కడ అన్నయ్య ఫణిరాజును ఎక్కించుకుని శాటిలైట్‌సిటీకి తిరుగు ప్రయాణమయ్యాడు. లాలాచెరువు నుంచి కవలగొయ్యి జాతీయ రహదారి సెంటర్‌కు వచ్చేసరికి ముందు వెళుతున్న పార్శిల్ లారీ సడన్‌గా ఆగింది. దీంతో లారీని బైక్ వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న చైతన్య అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీరామ వెంకట కిషోర్‌కు తీవ్రగాయాలు, ఫణిరాజుకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులిద్దరినీ చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కిషోర్‌ను అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. సంఘటన స్థలాన్ని బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్, ఎస్సై జగన్‌మోహన్‌రావు పరిశీలించారు. ఫణిరాజు ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై జగన్‌మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో చైతన్య మృతదేహం, గాయపడిన ఫణిరాజు, కిషోర్



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

శాటిలైట్‌సిటీలో విషాదఛాయలు

శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న అంబళ్ల చైతన్య (16) మృతి చెందగా, సోదరుడు ఫణిరాజు, స్నేహితుడు 14 ఏళ్ల శీరం శ్రీరామ వెంకటకిషోర్‌కు తీవ్రగాయాలు కావడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చైతన్య తండ్రి శ్రీను సీలింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తండ్రికి సాయంగా ఉండేందుకు అప్పుడప్పుడు ఫణిరాజు పనులకు వెళుతున్నాడు. ప్రమాద స్థలాన్ని జిల్లా ఎస్పీ పి.జగదీష్ శనివారం రాత్రి పరిశీలించారు.